క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

తిరువూరు: స్థానిక 11 కేవీ విద్యుత్ లైన్లకు మరమ్మతులు నిర్వహించనుండటంతో బుధవారం తిరువూరులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ అర్బన్ ఏఈ కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరువూరు బైపాస్‌రోడ్డు, ఎన్ఎస్‌పీ కాలనీ, గుళ్లపల్లి ఎంక్లేవ్, ఫ్యాక్టరీ సెంటర్, సుందరయ్య కాలనీ, హెచ్‌డీఎఫ్‌సీ రోడ్, చింతల కాలనీ, దారా పూర్ణయ్య టౌన్‌షిప్, శాంతినగర్, జాషువా చర్చి ఏరియా, సూర్యా రెస్టారెంట్ ఏరియా, కొత్త కాలనీ, తోకపల్లి ఏరియాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

ఇబ్రహీంపట్నం: జూపూడి, కిలేశపురం గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ వెంకన్నబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగ కమిటీ నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగ కమిటీలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పలువురిని నియమించారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగ కమిటీ కార్యదర్శులుగా కామళ్ల కోటేశ్వరరావు (విజయవాడ వెస్ట్), దర్శనాల వెంకట రమణ (జగ్గయ్యపేట), కోట దాసు (తిరువూరు), తానంకి రాంబాబు (తిరువూరు) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఘనంగా హెచ్‌పీసీఎల్ ఫౌండేషన్ డే

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఫౌండేషన్ దినోత్సవం కొండపల్లి ఐడీఏ ప్రాంతంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ డెప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు కార్మికుల సమక్షంలో కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1971లో పాకిస్తాన్ -భారత్ యుద్ధ సమయంలో కాల్‌టాక్స్ అనే కంపెనీ చమురు సమయానికి అందించక సైనికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ సమయంలో ప్రైవేట్ కంపెనీని నమ్ముకుంటే ఇబ్బందులు వస్తాయని భావించి కాల్ టాక్స్ సంస్థను 1974లో ప్రభుత్వం తరఫున ఆయిల్ కంపెనీగా జాతీయం చేశారన్నారు. హెచ్‌పీసీఎల్ 51 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్మికులను బహుమతులతో సత్కరించారు.

విస్సన్నపేట నుంచి ఎయిమ్స్‌కు బస్ సర్వీస్

నూజివీడు: విస్సన్నపేట నుంచి బస్సు సర్వీసును మంగళగిరిలోని ఎయిమ్స్ ఆస్పత్రికి ఈ నెల 16 నుంచి నడుపుతున్నట్లు ఇన్‌చార్జి డిపో మేనేజర్ జి.రాంబాబు మంగళవారం తెలిపారు. ఈ బస్సు సర్వీసు ఉదయం 6 గంటలకు విస్సన్నపేటలో బయలుదేరి నూజివీడు వచ్చి ఇక్కడి నుంచి రామన్నగూడెం, వట్టిగుడిపాడు, ఈదులగూడెం, ఆగిరిపల్లి, నున్న, విజయవాడ మీదుగా మంగళగిరిలోని ఎయిమ్స్ ఆస్పత్రి వద్దకు ఉదయం 8.50 గంటలకు చేరుతుందన్నారు. మళ్లీ సాయంత్రం 4.30 గంటలకు ఎయిమ్స్ ఆస్పత్రి వద్ద బస్సు విస్సన్నపేటకు బయలుదేరుతుందన్నారు. ఇటీవల నూజివీడు డిపోను పరిశీలించిన ఆర్టీసీ ఈడీ విజయరత్నం దృష్టికి స్థానిక విలేకరులు ఎయిమ్స్‌కు బస్సు సదుపాయం కల్పించాలని కోరిన మీదట ఆయన సానుకూలంగా స్పందించి సర్వీసును ఏర్పాటు చేశారు.

డాక్టర్ కేఎల్ రావు సేవలు చిరస్మరణీయం

మైలవరం: ఆంధ్రప్రదేశ్‌కు డాక్టర్ కేఎల్ రావు సేవలు చిరస్మరణీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ కేఎల్ రావు జయంతి కార్యక్రమం కళాశాల ప్రాంగణంలో మంగళవారం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్‌కి చెందిన డాక్టర్ కేఎల్ రావు తెలుగు జాతికి చేసిన సేవలు మరువరానివన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఆయా రంగాల్లో నిష్ణాతులు కావాలని, చదువుతో పాటు నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేయాలన్నారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు బహుమతులు అందజేశారు.

ప్రమాదకరంగా రసాయన వ్యర్థాలు!

- హెచ్.ముత్యాలంపాడు గ్రామ శివారులో ఆగని కెమికల్ వ్యర్థాల విడుదల
- పంట కాల్వల్లో ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి
- దుర్వాసనతో గ్రామస్తుల నరకయాతన
- కెమికల్ వ్యర్థాలతో కలిసిన నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్న మూగజీవాలు


హెచ్.ముత్యాలంపాడు గ్రామ శివారులో పంట కాల్వలో కెమికల్ వ్యర్థాలు


హెచ్.ముత్యాలంపాడు శివారులో కెమికల్స్ కారణంగా నల్లగా మారిన పంట కాల్వలో నీరు


కెమికల్ వ్యర్థాలను విడుదల చేసిన ప్రదేశంలో మాడిపోయిన గడ్డి, నేల

జి.కొండూరు: హెచ్ ముత్యాలంపాడు శివారులో కెమికల్ వ్యర్థాల విడుదల ఆగడం లేదు. కెమికల్ కంపెనీలు మినిమమ్ కామన్‌సెన్స్ లేకుండా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. కంపెనీల్లో కెమికల్ వ్యర్థాలను తీసుకొచ్చి జనారణ్యంలో వదిలేస్తున్నారు. ఇవి పంట కాల్వల్లో నీటితో కలిసి ప్రవహిస్తున్నాయి. ఈ తతంగమంతా జి.కొండూరు మండల పరిధి హెచ్.ముత్యాలంపాడు గ్రామ శివారులో కొంతకాలంగా కొనసాగుతోంది.

ట్యాంకర్లలో తీసుకొచ్చి

కెమికల్ కంపెనీలు వేల లీటర్ల వ్యర్థాలను ట్యాంకర్లలో తీసుకొచ్చి హెచ్.ముత్యాలంపాడు గ్రామ శివారులోని రహదారి పక్కన పంట కాల్వలో రాత్రి వేళల్లో విడుదల చేస్తున్నారు. ఇవి కాల్వలో ఉన్న నీటితో కలిసిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని నెలలుగా వర్షాలు లేకపోవడంతో వ్యర్థాలు భూమిలో ఇంకిపోవడంతో అంతగా సమస్య తలెత్తలేదు. ఇటీవల అప్పుడప్పుడు వానలు కురిశాయి. ఈ క్రమంలో కెమికల్ వ్యర్థాలు నీటితో కలిసి ప్రవహించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నీరు ప్రవహించినంత దూరం భూమి మాడిపోయి మొక్కలు మొలిచే అవకాశం లేకపోవడంతో ఖరీఫ్ సాగుపై ప్రభావం చూపుతుందని భయాందోళనకు గురవుతున్నారు. వీటి నుంచి వచ్చే దుర్వాసనతో గ్రామంలో ఉండలేకపోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. పొలాల్లో మేతకు వెళ్లిన పశువులు ఈ నీటిలో పొర్లడంతో, తాగడం వల్లన వ్యాధులు భారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యర్థాల పాపం ఎవరిది!

స్థానికంగా కొండపల్లి పారిశ్రామిక వాడలో పన్నెండు వరకు కెమికల్ కంపెనీలు న్నాయి. వీటితో పాటు ప్లాస్టిక్ కంపెనీలు, మడ్డి ఆయిల్ కంపెనీలు, టైర్ ఆయిల్ కంపెనీలు పది వరకు ఉన్నాయి. అయితే ఈ కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలు పారిశ్రామికవాడకు పక్కనే ఉన్న తొమ్మండ్రం వాగులోకి విడుదల చేస్తుండటంతో వ్యాధుల బారిన పడుతున్నామని కట్టుబడిపాలెం గ్రామస్తులు, వ్యవసాయ భూములు పండటం లేదని కవులూరు గ్రామస్తులు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారం లభించక ముందే ఇప్పుడు హెచ్.ముత్యాలంపాడు గ్రామ సమస్య వెలుగులోకి వచ్చింది. ఈ కంపెనీలే తమ వ్యర్థాలను హెచ్.ముత్యాలంపాడు గ్రామ సమీపంలో విడుదల చేస్తున్నాయిని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే అక్కడ ట్యాంకర్లలో తెచ్చి వ్యర్థాలు విడుదల చేసేది ఎవరో తమకు తెలియదని, ఆటువంటి పనులు తాము చేయమని కొండపల్లి పారిశ్రామిక వాడలోని కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. కొండపల్లి పారిశ్రామిక వాడ మినహా దగ్గర్లో ఎటువంటి కంపెనీలు కూడా లేకపోవడంతో ఈ వ్యర్థాళ విడుదలపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి.

పంట కాల్వలో కెమికల్స్‌ని వదలడం దుర్మార్గం



గ్రామ శివారులో రహదారి పక్కన ఉన్న పంట కాల్వలో కొంత కాలంగా కెమికల్ వ్యర్థాలను వదులుతున్నారు. రాత్రి వేళల్లో ట్యాంకర్లలో తీసుకొచ్చి వదలడంతో పట్టుకోలేకపోతున్నాం. ఈ వ్యర్థాలు నీటితో కలిసి వెళ్లినంత దూరంగా గడ్డి కూడా మాడిపోతుంది. త్వరలో వరి సాగు చేపడతాం. ఇలా వ్యర్థాలను వదిలితే వరి పంట నాశనమవుతుంది.

–కోట ఇమ్మానియేల్ రైతు, హెచ్.ముత్యాలంపాడు

దుర్వాసనకు పొలాల్లోకి రాలేకపోతున్నాం



మా పొలాలకు నీళ్లు వచ్చే కాల్వలో కెమికల్ వ్యర్థాలను వదులుతున్నారు. రేపు పంట వేసిన తర్వాత ఇలానే కెమికల్ వ్యర్థాలను వదిలితే పైరు కూడా మాడిపోయే అవకాశం ఉంది. వీటి నుంచి వచ్చే వాసనతో గ్రామంలో ఉండలేకపోతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–అయ్యంకి పెంటయ్య, రైతు, హెచ్.ముత్యాలంపాడు

'పొలం పిలుస్తోంది' సద్వినియోగం చేసుకోండి


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారి

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఏవో యడవల్లి రజని కోరారు. జూపూడి, ఇబ్రహీంపట్నం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం జరిగింది. వరి నారు మళ్లు, నాట్లను పరిశీలించారు. నారుమడిలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు రైతులకు వివరించారు. వ్యవసాయ సహాయకులు వాసవి, లక్ష్మణరావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

తిరువూరురూరల్: గానుగపాడు, జీకొత్తూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయాధికారి పద్మ ఆయా గ్రామాల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని వివరించి, అర్హుల జాబితాలో పేర్లు లేని రైతులు రైతు సేవా కేంద్రంలో అర్జీ ఇవ్వవచ్చని సూచించారు. వరిలో కలుపు యాజమాన్యం, నీటి యాజమాన్యం, పత్తిలో రసం పీల్చు పురుగుల నివారణ గురించి రైతులకు వివరించారు. వరి పంటకు ఎకరాకు రూ.850 చెల్లించి ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో చేరాలని, ఆగస్టు 15 లోపు ప్రీమియం చెల్లించాలని సూచించారు. ఏఈవో అరుణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వరుస పద్ధతిలో వరి నాట్లు వేయాలి

చాట్రాయి: రైతులు వరుస పద్ధతిలో వరి నాట్లు వేసుకోవాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని చాట్రాయిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పద్ధతిలో మొక్కల మధ్య దూరం ఉండటంతో గాలి, వెలుతురు తగులుతాయని పిలకల సంఖ్య పెరుగుతుందని బలమైన దుబ్బు ఏర్పడుతుందని, చీడ పీడల ఉధృతి తగ్గుతుందని, చెప్పారు.

ఎన్టీటీపీఎస్ కాలుష్యంపై కేంద్ర పర్యావరణ శాఖ సమీక్ష!

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ కాలుష్యంపై కేంద్ర పర్యావరణ శాఖ అధికారులు మంగళవారం పర్యటించినట్లు తెలిసింది. ఇటీవల కాలంలో ఎన్టీటీపీఎస్ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై, కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర పర్యావరణ శాఖ అధికారులకు పలువురు స్థానికులు ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదుల నేపథ్యంలో కేంద్ర పర్యావరణ అటవీ శాఖ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ నేతృత్వంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పలువురు సంస్థ ఎస్ఈలతో సమీక్షించారు. వివిధ ప్రాంతాల్లో కాలుష్యంపై తనిఖీ చేశారు. కేంద్ర పర్యావరణ శాఖ అధికారుల తనిఖీలపై ఎన్టీటీపీఎస్ అధికారులు గోప్యంగా ఉంచారు. దీనిపై అధికారులు ఎవరూ స్పందించలేదు.

సిబ్బంది నిర్లక్ష్యం.. తల్లికి వందనం దూరం



మైలవరం: ప్రైవేటు పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థులు తల్లులు తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు. ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని నారాయణ పాఠశాలలో జరిగింది. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లులకు తల్లికి వందనం డబ్బులు పడకపోవడంలో తల్లిదండ్రులు మంగళవారం పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆధార్ నంబర్లు తప్పుగా ఎంటర్ చేయడంతో సుమారు 400 మంది విద్యార్థులు అనర్హులుగా తేలారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.కె. రత్నకుమారి తప్పులను సరిజేస్తామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు వెనుదిరిగారు. స్కూల్ యాజమాన్యం కావాలని చేసినట్లుగా తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దాలి


అన్నవరం హైస్కూల్‌లో బాల్య వివాహ వ్యతిరేక ప్రచారోద్యమంపై కళాజాత

నూజివీడు: బాల్య వివాహాలు చేయడం నేరమని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని నూజివీడు సీడీపీఓ పిల్లి విజయకుమారి అన్నారు. బాల్య వివాహ వ్యతిరేక ప్రచారోద్యమంలో భాగంగా మండంలోని అన్నవరం జెడ్పీ హైస్కూల్లో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వీధి నాటిక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలికలకు 18 ఏళుల, బాలురకు 21 ఏళ్లు నిండకుండా వివాహాలు చేస్తే చట్ట ప్రకారం నేరంగా పరిగణిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని, జీవితంలో స్థిరపడిన తర్వాతే వివాహం చేయాలన్నారు. 'నూజివీడు'ను బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.విజయకుమారి, కో-ఆర్డినేటర్ రవి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, శాంతి కల్చరల్ సొసైటీ కళాకారులు రవికుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

మైలవరం: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మైలవరం ఎస్సై సుధాకర్ తెలిపారు. మైలవరం కోర్టు ప్రాంగణంలోని వికలాంగ విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలలో చనమోలు నాగభూషణం కుమార్తె గ్రీష్మిత పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిళ్లు, పలకలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ద్వారా చేస్తున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్డిగూడెం ఎస్సై మోహనరావు, జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్, మైలవరం కోర్టు ఏజీపీ ఏడీప్రసాద్, లయన్స్ క్లబ్ క్యాబినెట్ మెంబర్ డాక్టర్ సీహెచ్ బాలగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సాయి ప్రియకు ఉత్తమ హిప్నోథెరపిస్ట్ అవార్డు



ఆగిరిపల్లి: కొన్నేళ్లుగా సైకాలజిస్ట్-హిప్నోథెరపిస్ట్‌గా అనేక మంది జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొచ్చినందుకు డాక్టర్ సాయి ప్రియ ఉత్తమ హిప్నోథెరపిస్ట్ అవార్డును అందుకున్నారు. హైదరాబాదులో సోమవారం జరిగిన హిప్నోసిస్ అవార్డు–2025లో భాగంగా మండలంలోని కనసానపల్లికి చెందిన డాక్టర్ పేట సాయి ప్రియకు మానసిక ఆరోగ్య సేవా రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా అవార్డు లభించింది. మారుమూల గ్రామంలో పుట్టి గ్రామానికి రాష్ట్ర స్థాయి గుర్తింపు తీసుకురావడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయి ప్రియ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించి, హిప్నోథెరపీ ద్వారా మార్పులు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరు రామచంద్రరావు, మైండ్ సపోర్ట్ ఫౌండర్ శశికిరణ్, డాక్టర్ ప్రసన్న హరికృష్ణ, దేవాన్ని పాల్గొన్నారు.

చెవిలో పూలతో కార్మికుల నిరసన


కొండపల్లిలో వినూత్న నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ ఇంజనీరింగ్ కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం మూడో రోజు చెవులో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, జీవో 36 ప్రకారం రూ.26 వేల వేతనం చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి మహేష్, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ మేస్త్రీ ఎం.వాసు, శ్రీనుపాల్గొన్నారు.

కార్మికుల నిరసన ప్రదర్శన

తిరువూరు: న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం ఆమోదించనందుకు నిరసనగా సమ్మె నిర్వహిస్తున్న తిరువూరు నగరపంచాయతీ కార్మికులు మంగళవారం పట్టణంలో ప్రదర్శన జరిపారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి బోస్ సెంటర్ వరకు ప్రదర్శన జరిపిన అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అగ్నిపత్రి వెంకటేశ్వరరావు మాట్లాడారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ముసునూరు: పలు గ్రామాల భూ సంబంధ సమస్యలను పరిష్కరించి ప్రజలకు సత్వర రెవెన్యూ సేవలను అందిస్తానని నూతన తహసీల్దార్ డి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం ఆమె ముసునూరు మండల రెవెన్యూ కార్యాలయంలో రెగ్యులర్ తహసీల్దార్‌గా బాధ్యతలను చేపట్టారు. గతంలో ఆమె నూజివీడు నియోజకవర్గంలోని చాట్రాయి మండల తహసీల్దార్‌గా పని చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ శ్రీనివాస్, సీనియర్ సహాయకుడు బి.సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు స్వాగతం పలికారు.

వృత్తి విద్యా కోర్సులతో నైపుణ్యాభివృద్ధి

ముసునూరు: వృత్తి విద్యా కోర్సులను విద్యార్థులు వినియోగించుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని బాలికల గురుకులం ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి అన్నారు. ప్రపంచ యూత్ స్కిల్స్ దినోత్సవ సందర్భంగా మంగళవారం ముసునూరులోని బాలికల గురుకుల పాఠశాలలో బ్యూటీ, వెల్‌నెస్ కోర్సులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సుల అభ్యాసంతో విద్యార్థుల్లో నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, డ్రాయింగ్, రోల్ ప్లే పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఎంశ్రీ బ్యూటీ, వెల్‌నెస్ టీచర్ తుల సీబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయేతర ఇంధన వనరులతో కాలుష్య నివారణ

ఆగిరిపల్లి: సంప్రదాయేతర ఇంధన వనరులతో కాలుష్యాన్ని అరికట్టొచ్చని ఏపీ ట్రాన్స్‌కో గ్రిడ్ ఇండియా చీఫ్ ఇంజినీర్ కేవీబీ రామ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పోతవరప్పాడు ఎస్ఆర్ఐ ఇంజినీరింగ్ కాలేజీలో సంప్రదాయేతర ఇంధన నిర్వహణ, సామర్థ్యంపై ఏపీ ట్రాన్స్‌కో ఇంజినీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.నాగభాస్కర్, పవర్ రీసెర్చ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ ఇంజినీర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి అవకాశం

15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ


ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జిలు, న్యాయవాదులు

నూజివీడు: కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య నానాటికి భారీగా పెరుగుతున్న నేపథ్యంలో రాజీ పడదగిన కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకునే అవకాశాన్ని దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు కల్పించిందని నూజివీడులోని 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన జడ్జిలు, న్యాయవాదులు కలిసి మధ్యవర్తిత్వం-దేశం కోసం అనే కార్యక్రమంపై పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వంపై కక్షిదారులకు అవగాహన కలిగించడానికి ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కోర్టులో కేసులు నడుస్తున్నా కక్షిదారులు రాజీ కోరితే మీడియేషన్ సెంటర్‌కు పంపుతారన్నారు. కొందరు న్యాయవాదులతో కలిసి మీడియేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారన్నారు. వివాహ సంబంధిత వివాదాలు, ప్రమాద కేసులు, గృహ హింస, చెక్ బౌన్స్ కేసులు, కమర్షియల్ వివాదాల కేసులు, వినియోగదారుల కేసులు, భూముల పంపకాల కేసులు, భూసేకరణ తదితర కేసులన్నింటినీ మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోవచ్చన్నారు. మధ్యవర్తిత్వ ప్రక్రియను రహస్యంగా ఉంచుతారని, మధ్యవర్తిత్వానికి నిష్పక్షపాత తటస్థ వ్యక్తి ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి శివపార్వతి, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఒ.అనూష, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రావణి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మన్నం రమేష్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: మధ్యవర్తిత్వం ద్వారా కేసులు సత్వర పరిష్కారం చేసుకోవాలని మైలవరం జడ్జి ఎం. శైలజ తెలిపారు. మైలవరం కోర్టులో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్ మంగళవారం నిర్వహించారు. సమావేశంలో మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్. రమేష్‌బాబు, జి. శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు వీటీ కిశోర్, ముల్లంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

మైలవరం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మైలవరంలోని భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంక్షేమ బోర్డును పునఃప్రారంభించి సంక్షేమ క్లెయిమ్‌లు జరిగేలా చూడాలన్నారు. రెగ్యులర్ ఐడీ కార్డులను రెన్యువల్ పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంక్షేమ బోర్డు నుంచి నిధులు దుర్వినియోగం జరగకుండా నిధులను తమకే ఖర్చు చేయాలని, భవన నిర్మాణ కార్మికులను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్ర మహాసభలు గుంటూరు జిల్లాలో జరుగుతాయని తెలిపారు. సమావేశంలో మైలవరం మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు మధు శ్రీనివాసరావు, ధరణికోట వెంకటేశ్వరరావు, నల్లబోతుల దుర్గారావు, నాగమల్లేశ్వరరావు, ఎస్.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

ఆరుగొలనుపేటలో ఎబెట్ పిచికారీ

చాట్రాయి: ఆరుగొలనుపేట పర్వతాపురం పంచాయతీల ఆధ్వర్యంలో మంగళవారం దోమల నివారణకు ఎబెట్ పిచికారీ చేశారు. ఈ సందర్భంగా డ్రెయినేజీలు, మురుగు నీటి నిల్వలు ఉన్న చోట పిచికారీ చేశారు. అనంతరం ఇంటి పరిసరాల్లో కొబ్బరి బొండాలు, పాత టైరు, పాడైన ప్లాస్టిక్ డబ్బాలను తొలగించాలని పీహెచ్‌సీ సిబ్బంది ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మిద్దె శివాజీ, పుచ్చకాయల అప్పిరెడ్డి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు ప్రభాకర్, నాగమణి, హెల్త్ అసిస్టెంట్ దార్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

తిరువూరు: ముఠా కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సుందరయ్య భవన్లో మంగళవారం ఎన్టీఆర్ జిల్లాముఠా వర్కర్ల యూనియన్ నాలుగో మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా ముఠా వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షులుగా ఎస్‌సీహెచ్ శ్రీనివాస్, అధ్యక్ష ఉపాధ్యక్షులుగా ఎం సీతారాములు, సీహెచ్ నరసింహులు, వెంకట్రావు, ఎం.ఇశ్రాయిల్, ప్రధాన కార్యదర్శిగా మట్టగుంజ బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఈవీ నారాయణ, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

పేరుమార్పు

బలసా సీత @ త్రిల్లింగి సీత W/o. బలసా మధుబాబు, డోరు నెం. 3-92, జూపూడి గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, ఎన్.టి.ఆర్. జిల్లా.
బలసా సీత (పాత పేరు) అను నా యొక్క పేరును ఇక నుంచి త్రిల్లింగి సీత (కొత్త పేరు)గా మార్చుకొని ఉన్నాను. కావున నేటి నుండి నా పేరును త్రిల్లింగి సీత అని గమనించగలరు.

ప్రకటన

బ్యాంక్ ఆఫ్ బరోడా, న్యూ [illegible] బ్రాంచి, హైదరాబాద్ [illegible] శ్రీ వెదుకూరి శ్రీనివాస్ ప్రసాద్, [illegible] 60 సంవత్సరాలు (PAN: CMMPS8400E, Aadhaar No: 705108432626), ప్రస్తుత నివాసం: 6-138, [illegible] మేడ్చల్ & మల్కాజిగిరి, తెలంగాణ-500014 [illegible] ప్రజలకు తెలియజేస్తున్నాము.

[illegible] 10 రోజులలోపు బ్యాంకుకు సంప్రదించి, [illegible] సమర్పించగలరు.

10 రోజులలోపు ఎటువంటి స్పందన రాకపోతే, [illegible] బ్యాంకు భావిస్తుంది మరియు [illegible] ప్రక్రియను కొనసాగిస్తుంది.

షెడ్యూల్ ఆస్తి వివరములు

షెడ్యూలు: 1వ ప్రతి: ఏలూరుజిల్లా, నూజివీడు సబ్-రిజిస్ట్రార్ [illegible] నూజివీడు మండలం, మొర్సపూడి గ్రామ పంచాయితీ పరిధిలో చేరిన మొర్సపూడి గ్రామములోని ఆర్.యస్.నెం. 130/1ఎ3. 130/1బి3, 130/ [illegible] యల్.పి.యమ్. నెం.60 [illegible] 4-82 [illegible] **తూర్పు:** [illegible] **దక్షిణం:** [illegible] **పడమర:** యస్.యస్.పి కాలువ, **ఉత్తరం:** రోడ్డు. [illegible]
2వ ప్రతి: ఏలూరుజిల్లా, నూజివీడు సబ్-రిజిస్ట్రార్ [illegible] మొర్సపూడి గ్రామ పంచాయితీ పరిధిలో చేరిన మొర్సపూడి గ్రామములోని ఆర్.యస్.నెం. [illegible] యల్.పి.యమ్.నెం.61 [illegible] 0-609 [illegible] **తూర్పు:** యస్.యస్.పి కాలువ, **దక్షిణం:** [illegible] **పడమర:** [illegible] **ఉత్తరం:** రోడ్డు. [illegible]

Mukkamala Sai Ravikanth-Advocate
D.No.21-7-24, Ramaraju Street,
Mutyalampadu, Satyanarayanapuram,
Vijayawada-520011. Cell: 9948999775.

స్కూల్ భద్రతా దినోత్సవం
- స్కూల్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలి
- విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి
- అగ్ని ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలి
- ప్రథమ చికిత్సకు అవసరమైన వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలి
- వర్షాకాలంలో స్కూల్ పరిసరాలలో నీళ్ళు నిలవ ఉండకుండా చూసుకోవాలి

కె.వి.ఆర్. ఎడ్యుకేషనల్ సొసైటీ వారి
ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందిన విద్యాసంస్థ
K.V.R. జూనియర్ & ఒకేషనల్ కాలేజ్ College Code: 13133
కె.పి.ఆర్. కన్వెన్షన్, మెయిన్‌రోడ్, విస్సన్నపేట, ఎన్.టి.ఆర్. జిల్లా
సెల్: 72078 44688, 95500 90339

స్కూల్ భద్రతా దినోత్సవం
- స్కూల్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలి
- ప్రథమ చికిత్సకు అవసరమైన వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలి
- వర్షాకాలంలో స్కూల్ పరిసరాలలో నీళ్ళు నిలవ ఉండకుండా చూసుకోవాలి

Since: 1976
సెవెంత్-డే ఎడ్వంటిస్ట్ హైస్కూల్
(ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ)
పశ్చిమ ఇబ్రహీంపట్నం
ఇంగ్లీష్ మీడియం నర్సరీ నుండి 10వ తరగతి వరకు
- ఉన్నత విద్యకు చక్కని క్రమ శిక్షణకు పెట్టింది పేరు సెవెంత్ - డే స్కూల్.
- ఆహ్లాదకరమైన సువిశాల తరగతి గదులు మరియు ఆట స్థలము.
- అత్యున్నతమైన విద్యార్హత మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన.
- అత్యాధునికమైన సైన్స్ లేబోరేటరీ మరియు లైబ్రరీ.
- డే/రెసిడెన్షియల్, కో ఎడ్యుకేషన్.
- బాలురకు మరియు బాలికలకు వేర్వేరు అత్యాధునికమైన వసతి గృహములు మరియు సమపాళ్ళతో కూడిన భోజనము.
- చదువులో వెనుకబడిన విద్యార్థిని, విద్యార్థులకు వ్యక్తిగత శ్రద్ధ తీసుకొనబడును.
- S.S.C, XI & XII విద్యార్థులకు పాఠశాల అనంతరం ప్రత్యేకమైన స్టడీ అవర్స్ నిర్వహించబడును.
- డే స్కాలర్స్‌కు బస్ సౌకర్యం కలదు.
- సహపాఠ్య ప్రణాళిక కృత్యములు (కార్యక్రమములు).
- విశాలమైన (ఆహ్లాదకరమైన) ఏ.సి. కంప్యూటర్ ల్యాబ్.

ప్రిన్సిపాల్: డేవిడ్ మార్క్
సెల్: 7981379619

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు),
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com